ఇసుక లేదు... పనీ లేదు

- రోడ్ల పైనే భవన నిర్మాణ కార్మికుల పడిగాపులు
- దొరికితే అప్పులు.. లేకపోతే పస్తులు
- పూట గడవక రోజుకూలీల అవస్థలు



పనుల కోసం వేచి చూస్తున్న భవన నిర్మాణ కార్మికులు



పని లేక ఖాళీగా కూర్చున్న భవన నిర్మాణ కార్మికులు

కంచరపాలెం: నగరంలో ఇసుక కొరతతో దినసరి కూలీలకు పస్తులు తప్పడం లేదు. ఈ మూడు నెలల కాలంలో కనీసం 15 రోజులు కూడా కూలీ దొరకలేదని, ఇలా అయితే ఇళ్లు ఎలా గడుస్తాయని భవన నిర్మాణ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉచితంగా ఇసుక ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో దళారుల ఇష్టా రాజ్యంగా మారిందని కార్మికులు వాపోతున్నారు. ప్రస్తుతం టన్ను ఇసుక ధర రూ. 1000 నుంచి 2000 కు చేరింది. ఇంత రేటుతో కొని కట్టడం భారంగా మారడంతో భవన నిర్మాణదారులు పనులు నిలిపివేశారు. దీంతో రోజువారీ కూలీలు పనుల్లేక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ పరిధిలో సుమారు తొంభై ఐదు వేల మంది కార్మికులు, భవన నిర్మాణాలపై ఆధారపడి జీవించేవారు ఉన్నారు. వారంతా ఇసుక కొరతతో అవస్థలు పడుతున్నారు.

పనుల కోసం పడిగాపులు

జ్ఞానాపురం, అల్లిపురం, దొండపర్తి, నీలమ్మవేప చెట్టు, డాబాగార్డెన్స్, జగదాంబ, పూర్ణామార్కెట్, కొత్తరోడ్డు, వన్‌టౌన్, పాతపోస్టాఫీస్ తదితర ప్రాంతాల్లో రోజువారి పనుల కోసం సుమారు 1350 మంది కూలీలు, మేస్త్రీలు పనుల కోసం వేచి చూస్తుంటారు. మట్టి పనికి, సిమెంట్ పనికి, మేస్త్రీ పనులకు ఇక్కడ పనివారు దొరుకుతుంటారు. అంతే కాకుండా జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రోడ్డు జంక్షన్, దొండపర్తి కూడలి, అల్లిపురం ఇలా పలు సెంటర్లలో కూడా రోజువారీ కూలీలు పనుల కోసం వేచి ఉంటారు. ఇక్కడికి ఏదైనా ఆటో గాని, ద్విచక్ర వాహనాలు వచ్చి ఆగితే చాలు అంతా ఒక్కసారి ఆశగా గుమిగూడుతారు. ఏదైనా పని దొరుకుతుందేమో అని ఎదు రుచూస్తారు. ఉదయం 7 గంటల నుంచి విశాఖ శివారు ప్రాంతాల నుంచి కూడా వస్తుంటారు. రవాణా ఖర్చులే తమకు రోజుకు రూ. 100 నుంచి 180 వరకు అవుతుందని వీరు చెబుతున్నారు. పని దొరికితే ఇబ్బంది లేదు. లేకపోతే ఈ ఖర్చులు అదనపు భారమవుతాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో రోజూ కాకపోయినా నెలలో కనీసం పక్షం కంటే ఎక్కువ రోజులు పని దొరికేదని చెబుతున్నారు. పల్లెల్లో పనులు లేక నగరాల్లోకి వస్తే ఇసుక కొరత వల్ల ఇప్పుడు అది కూడా దక్కడం లేదని వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంత ఇబ్బంది పడలేదని చెబుతున్నారు. పనులు లేకపోవడంతో ఇళ్లల్లో ఆడాళ్లని, పిల్లలను ఇతర పనులకు పంపించే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. ఇసుకపై సరైన నిర్ణయం తీసుకోకపోతే కూలీలు పస్తులతో చావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు.

అప్పులు చేసి రోజులు గడుపుతున్నాం



ఇసుక ధర ఎప్పుడూ లేనంతగా పెరిగిపోవడంతో భవన నిర్మాణాలు సరిగ్గా సాగడం లేదు. మేము ఈ పనుల మీదే ఆధారపడి ఉన్నాం. మూడు నెలల కాలంలో 20 రోజులైనా పని దొరకలేదు. పూట గడవడం కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి. - రమణ, కూలీ, అల్లిపురం

వారానికి ఒక్కరోజు కూడా పని ఉండట్లేదు



ఇసుక కొరతతో పనుల్లేక ఇబ్బంది పడుతున్నాం. వారానికి ఒక రోజు కూడా పని దొరకడం కష్టంగా ఉంది. కుటుంబాన్ని పోషించేందుకు ఇబ్బందిగా ఉంది. ఈ కూలి పనుల కోసమే ఇక్కడికి వచ్చి స్థిరపడ్డాం. మూడు నెలలుగా సరిగ్గా పనుల్లేవు. - వరలక్ష్మి, పూర్ణామార్కెట్

పూట గడవడం కష్టంగా ఉంది



అన్నం డబ్బాలు పట్టుకుని ఉదయం 8 గంటలకు ప్రధాన కూడలి ప్రాంతాలకు కూలికి వస్తాను. పని కోసం 10 గంటల వరకు ఎదురు చూస్తాను. ఆగిన ప్రతి బండి వద్దకు పరుగు తీస్తాం. పని దొరికితే సరి.. లేదంటే ఇంటి ముఖం పట్టాల్సిందే. ఇక్కడ నాలాగా పనుల కోసం పడిగాపులు కాసేవారు వందల సంఖ్యలో ఉన్నారు. మరోవైపు నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో పూట గడవడం కష్టంగా ఉంటోంది. -అరుణ, భవన నిర్మాణ కార్మికురాలు, జ్ఞానాపురం

చాలా చోట్ల పనులు ఆగిపోవడం వల్లే..



గతంలో వారానికి ఏడు రోజులు పని దొరికేది. ప్రస్తుతం నాలుగు నెలలుగా పనులు దొరకడం లేదు. ఇసుక దొరక్క, ఎక్కువ ధరకు కొనలేక చాలా వరకు పనులు ఆగిపోయాయి. దీంతో మాలాంటి వారికి కూలి పనిలేక ఇల్లు గడవడం కష్టంగా మారింది. దసరా పండగ సరిగ్గా చేసుకోలేకపోయాం. దీపావళితోనైనా మా జీవితాల్లో వెలుగులు నిండుతాయేమో చూడాలి. -నాయుడు, భవన నిర్మాణ కార్మికుడు, కంచరపాలెం

పీటీడీ వైఎస్సార్ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాయుడు



జేఎం నాయుడు

డాబాగార్డెన్స్: పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విశాఖపట్నంకు చెందిన జేఎం నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్లా చంద్రయ్య ప్రకటించారు. విజయవాడలో జరిగిన స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో జేఎం నాయుడును అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీఎస్ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కార దిశగా కృషి చేస్తానని నాయుడు తెలిపారు.

నూతన నియామకం



సత్యనారాయణకు నియామకపత్రం అందిస్తున్న సాయి రమేష్

డాబాగార్డెన్స్: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ సౌత్ జ్యూరిస్‌డిక్షన్ చైర్మన్‌గా దాడి సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కమిషన్ రాష్ట్ర చైర్మన్ సాయి రమేష్ దాడికి నియామక పత్రం అందజేశారు. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులు, వాటి కోసం వెచ్చించే రుసుముకు సరైన న్యాయం జరగని సందర్భంలో వారికి తగిన న్యాయం చేయడానికి ఈ చైర్మన్ పదవి వినియోగించాలని సాయి రమేష్ తెలిపారు. దాడి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో అన్ని ప్రాంతాల్లో పర్యటించి, వినియోగదారుల సమస్యలపై పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వివాహానికి వాసుపల్లి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఓ నిరుపేద కుటుంబంలో వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. దక్షిణ నియోజకవర్గానికి చెందిన మహాలక్ష్మీనాయుడు కుమారుడు సంతోష్‌కుమార్, శ్రీదేవి దంపతుల వివాహ వేడుకకు హాజరు కావాలని కోరుతూ వాసుపల్లిని 104 ఏరియాలోని ఆయన కార్యాలయానికి వెళ్లి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ రూ.5వేలు అందజేశారు.


వరద బాధితులకు విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న వెల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విశాఖ వెల్డింగ్ అసోసియేషన్ రూ.25 వేల విరాళాన్ని కలెక్టర్ ఎం.హరేందిర ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ మానవత్వంతో సభ్యులందరూ కలసి ఈ మొత్తాన్ని సమకూర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రఘు, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, సెక్రటరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కుటుంబ సభ్యునికి చెక్కు అందజేత



ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు వామనరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ నాన్ పీహెచ్ ఎంప్లాయీస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యుడు గుర్రం సత్యనారాయణ కుటుంబ సభ్యులకు రూ.4.9 లక్షల చెక్కు సొసైటీ అధ్యక్షుడు వీవీ వామనరావు మంగళవారం అందజేశారు. ఆగస్టు 6న మరణించిన సత్యనారాయణకు సొసైటీలో అప్పు ఉన్నప్పటికీ మినహాయించి... ఇన్సూరెన్స్ డబ్బులను కుమార్తె ఎస్.సునీతకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ కె.ఎల్లయ్య, డైరెక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

అల్లిపురం: పేదలకు ఎంతో కొంత తనవంతుగా సాయం చేయడం ఇష్టమని వైఎస్సార్ సీపీ 33వ వార్డు నాయకుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము అన్నారు. వార్డులోని పేద మహిళలకు 5 కేజీల చొప్పున బియ్యం మంగళవారం ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ప్రతీ నెల పేద మహిళలు, వృద్ధులకు బియ్యం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఐవీఎఫ్ కేంద్రాల్లో పేదలకు ఫీజు తగ్గించాలి

తనిఖీలు చేసిన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



ఐవీఎఫ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు, వైద్యుల బృందం

మహారాణిపేట: ఐవీఎఫ్ కేంద్రాలను ఆశ్రయించే పేదలకు ఫీజు తగ్గించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. ఆయనతోపాటు పలువురు వైద్యులతో కూడిన బృందం నగరంలోని ఐవీఎఫ్ కేంద్రాలను మంగళవారం తనిఖీ చేసింది. నోవా ఐవీఎఫ్ కేంద్రం, ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రాల్లోని ఆపరేషన్ థియేటర్, స్కానింగ్ మెషిన్ పరిశీలించారు. వీటిలో ఏఆర్‌టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయా..? లేవా..? తెలుసుకున్నారు. వైద్యులు, ఇతర స్టాఫ్ విద్యార్హతలు, ల్యాబ్ పరికరాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. తనిఖీ బృందంలో ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి గైనికాలజిస్టు డాక్టర్ గీతా వందన, కేజీహెచ్ రేడియాలజిస్టు డాక్టర్ రాధ, కేజీహెచ్ పెథాలజిస్టు డాక్టర్ టి.కిషోర్, ఇతర వైద్యులు డాక్టర్ శోభశ్రీ, ఎల్.వి.రమణి, మానిటరింగ్ కన్సల్టెంట్ కె.శివాజీ, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వేడుకోలు

డాబాగార్డెన్స్: విశాఖ ఉత్తర నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనపై కొంత మంది కక్షపూరితంగా దాడులు చేయిస్తున్నారని, ఈ విషయమై కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ విచారణ చేపట్టి రక్షణ కల్పించాలని చప్ప రామునాయుడు వేడుకున్నారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13న తనతోపాటు కుటుంబ సభ్యులపైనా హత్యాయత్నం జరిగిందన్నారు. ఈ విషయమై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, దాడి వెనుక ఎవరున్నారో విచారించి న్యాయం చేయాలని కోరారు.

తోపుడుబళ్లు తొలగించడం అన్యాయం

- కార్మికులపై కూటమి ప్రభుత్వం దాడి
- సీఐటీయూ జోన్ కార్యదర్శి వెంకటరావు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

సీతమ్మధార: జోన్ – 3 పరిధి చినవాల్తేరులోని కోటక్ స్కూల్ సమీపంలో గల రైల్వే గెస్ట్ హౌస్ ఫుట్‌పాత్‌పై ఉన్న 23 తోపుడుబళ్లను తొలగించడం అన్యాయమని సీఐటీయూ జోన్ కార్యదర్శి పి.వెంకటరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలగించిన తోపుడుబళ్లను యథావిధిగా కొనసాగించుకోవడానికి తక్షణమే అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. కేవలం ఎక్స్ (ట్విట్టర్)లో ఎవరో తోపుడుబళ్లపై చేసిన కామెంట్స్‌పై రెండు గంటల్లో జీవీఎంసీ, సచివాలయ అధికారులు, పోలీసులు వచ్చి తొలగించడం సరికాదన్నారు.

15 సంవత్సరాల నుంచి వ్యాపారం చేసుకుని బతుకుతున్న వారి ఉపాధిపై కొట్టడం సరికాదని మండిపడ్డారు. విశాఖ జిల్లా తోపుడు బళ్లు, చిల్లర వర్తక కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సింహాచలం మాట్లాడుతూ నేషనల్ హైవే బిర్లా సెంటర్, మర్రిపాలెం గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించుకుని షాపింగ్ కాంప్లెక్స్, కార్ల షోరూమ్ కట్టిన వారిపై చర్యలు తీసుకోకుండా తోపుడు బళ్ల కార్మికులను వేధించడం సరికాదన్నారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు అనపర్తి అప్పారావు మాట్లాడుతూ 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టాన్ని జీవీఎంసీ కమిషనర్ పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ చట్టం ప్రకారం తోపుడు బళ్ల కార్మికులకు వెండింగ్ కార్డులు ఇచ్చారని, తక్షణమే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే తోపుడు బళ్ల కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆశతో ఎదురు చూస్తే... అధికారంలోకి వచ్చాక మాపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎ.అప్పారావు, కె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఖాతాల్లో డబ్బులేయకుంటే సమ్మె చేస్తాం

ధర్నాలో సీఐటీయూ నాయకులు



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు కుమార్



ధర్నాలో పాల్గొన్న జీవీఎంసీ కార్మికులు

సీతమ్మధార: జీవీఎంసీ కార్మికుల జీతాల నుంచి ఆదాయపు పన్ను పేరుతో చట్ట విరుద్ధంగా కట్ చేసిన డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ పార్కు వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల నుంచి కట్ చేసిన డబ్బులు ఎస్ఎల్ఎఫ్‌లో ఉంచడం అన్యాయమన్నారు. కట్ చేసిన మూడు కోట్ల రూపాయలను కార్మికుల ఖాతాల్లో జమ చేయకుంటే సమ్మెకు సిద్ధమవుతామని హెచ్చరించారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు నేటికీ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఓటమి తప్పదని హెచ్చరించారు. ధర్నా అనంతరం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌తో సీఐటీయూ నాయకులు చర్చలు జరిపారు. ఎస్ఎల్ఎఫ్ గ్రూపు సభ్యులతో చర్చించి కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, ఎంపీ ప్రసాద్, జె.నాయుడు, గొలగాని అప్పారావు, బి.రత్నం, ఒమ్మి అప్పారావు, ఈశ్వరావు, గణేష్, ఈ.ఆదినారాయణ, వరలక్ష్మి, శేషు, సత్యవతి పాల్గొన్నారు.

అందరి సహకారంతో హిందీ అభివృద్ధి



సదస్సు ప్రారంభిస్తున్న అజమతుల్లా ఖాన్

మహారాణిపేట: హిందీ భాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నేవల్ డాక్‌యార్డు జనరల్ మేనేజర్ (మానవ వనరులు) కమొడోర్ అజమతుల్లా ఖాన్ కోరారు. ఫిషింగ్ హార్బర్ బీచ్‌రోడ్డులోని భారతీయ మత్స్య పరిశోధన సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం హిందీ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందీ భాషాభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. భారతీయ మత్స్య పరిశోధన సంస్థ విశాఖ కార్యాలయ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి మాట్లాడుతూ హిందీ అభివృద్ధి కోసం తీసుకున్న చర్యలు వివరించారు. స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ లలన్ కుమార్, వీరేంద్ర కాజీ, ప్రవీణ్ కుమార్, షానవాజ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా 'ఎంత పని చేశావ్ చంటి' ప్రీ రిలీజ్



మాట్లాడుతున్న హీరో శ్రీనివాస్

అల్లిపురం: పీజీకే మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీనివాస్ ఉలిశెట్టి హీరోగా, శాంతిప్రియ, నిహారిక హీరోయిన్లుగా, ఉదయ్‌కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించిన 'ఎంత పని చేసావ్ చంటి' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏపీ మా అధ్యక్షుడు దాడి సత్యనారాయణ, పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, దర్శకుడు యాద్‌కుమార్ తదితరులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా హీరో శ్రీనివాస్ మాట్లాడుతూ సినిమా షూటింగ్ మొత్తం విశాఖలోనే జరిగిందన్నారు. అక్టోబర్ 25న సినిమా విడుదలవుతుందని తెలిపారు.

గాంధీపార్కులో అధ్వానంగా పారిశుద్ధ్యం



గాంధీపార్కులో పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార: నిత్యం సందర్శకులతో రద్దీగా ఉండే జీవీఎంసీ గాంధీపార్కు చెత్తకుప్పల నిలయంగా మారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడికి సమీపంలోనే స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరం కొనసాగుతోంది. సీఐటీయూ, ఏఐటీయూసీ, తదితర ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో ధర్నాలు జరుగుతుంటాయి. పోలీసులు కూడా బందోబస్తు నిమిత్తం వస్తుంటారు. మీడియా కవరేజీ కోసం పాత్రికేయులు కూడా ఇక్కడకు వస్తారు. ఇంతటి ప్రాధాన్యత గల గాంధీపార్కులో పారిశుద్ధ్యం మచ్చుకైనా కనిపించడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి కార్యక్రమాల నిర్వహణ కోసం వచ్చే వారు దుర్వాసన భరించలేక సతమతమవుతున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగానే ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులు స్పందించి గాంధీపార్కులో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.

డీపీటీవోకు అభినందనలు



జిల్లా ప్రజా రవాణా అధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బి.అప్పలనాయుడును విశాఖ జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ జై భీమ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా సెక్రటరీ యల్లపు రాంబాబు, పలువురు సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.

'టీడీఆర్‌లు కొని రోడ్డున పడ్డాం'

డాబాగార్డెన్స్: అప్పులు చేసి టీడీఆర్‌లు కొన్నామని, రెండున్నరేళ్లుగా చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక రోడ్డున పడ్డామని తణుకు టీడీఆర్ బాధితులు వాపోయారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బాధితులు రాజశేఖర్, శివానంద్, వెంకటమణి, నక్కా శ్రీధర్, దిలీప్‌కుమార్, పృథ్వీ, హనుమంతరావు, రామకృష్ణ మాట్లాడారు. తణుకు మున్సిపల్ కమిషనర్ ద్వారా 2021–22లో కొంతమంది భూమి యజమానులకు టీడీఆర్ జారీకి అనుసరించే ప్రామాణిక, సాధారణ విధానం ప్రకారం జారీ చేయబడ్డాయని, తామంతా(బిల్డర్లు) పైన పేర్కొన్న బాండ్‌లు ప్రభుత్వ పోర్టల్ నుంచి అధికారికంగా కొనుగోలు చేశామని తెలిపారు. అయితే, టీడీఆర్ బాండ్ల జారీలో ఉల్లంఘనలు/మోసం జరిగినట్టు పేర్కొంటూ గత ప్రభుత్వం 2022 ఫిబ్రవరి నెలలో ఆ బాండ్లను బ్లాక్ చేసిందన్నారు. ఈ బాండ్ల జారీలో తణుకు మున్సిపల్ కమిషనర్ అవకతవకలకు పాల్పడ్డారని, ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు ప్రభుత్వ విచారణలో పేర్కొందన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా 2 నెలల వ్యవధిలో సమగ్ర విచారణ జరపాలని ఈ ఏడాది మార్చి 19న ఆదేశించిందన్నారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా విచారణ ఆలస్యమై, గడువులోగా కొత్త ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. కొత్త ప్రభుత్వం తమకు మద్దతు ఇస్తుందని భావించామని, అయితే ఈ నెల 14న కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పోర్టల్ నుంచి అధికారికంగా కొనుగోలు చేసిన 29 తణుకు టీడీఆర్ బాండ్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బిల్డర్లకు భారీ ఆస్తి నష్టాలు సృష్టిస్తుందని, రాష్ట్రంలో దాదాపు 800 ప్రాజెక్టులపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ప్రభుత్వం బిల్డర్లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉక్కు ఉద్యోగులను తొలగించే కుట్రలు ఆపాలి

సీతమ్మధార : వీఆర్ఎస్ సర్వే పేరుతో విశాఖ ఉక్కు కార్మికులు, ఆఫీసర్ల తగ్గింపు కుట్రలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. వీఆర్ఎస్ కోసం స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్లు, పర్మినెంట్ కార్మికులు తమ సన్నద్ధతను ఈ నెల 29వ తేదీ లోపు తెలియజేయాలని పేర్కొందని తెలిపింది. ఒకవైపు స్టీల్ ప్లాంట్‌ను అభివృద్ధి బాట పట్టిస్తామని, నవంబర్ నెల నుంచి రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌ను నడిపించే పనులు ప్రారంభిస్తామని ప్రకటనలు చేస్తూ.. మరోవైపు ప్లాంట్‌ను నడపడానికి కావలసిన ఆఫీసర్లను, పర్మినెంట్ కార్మికులను తగ్గించడానికి పూనుకోవడం ప్లాంట్‌ను కష్టాల్లో నెట్టివేయడమే అవుతుందని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ లాభాల బాట పట్టాలంటే పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, దీనికి కనీసం 19,000 మంది ఆఫీసర్లు , పర్మినెంట్ కార్మికులు అవసరమని పేర్కొన్నారు. కానీ నేడు 12700 మంది మాత్రమే ఉన్నారని, వీరిలో కూడా వీఆర్ఎస్ పేరుతో తగ్గించడం అంటే ప్లాంట్‌ను పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడవనివ్వకుండా నష్టాల్లోకి నెట్టడమే అవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించి ఉద్యోగుల తగ్గింపు ప్రక్రియను నిలిపివేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రం కుట్రలను స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్లు, కార్మికులు తిప్పికొట్టాలని విశాఖ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.

ఉత్సాహంగా అంతర కళాశాలల గణిత పోటీలు



విద్యార్థులతో అతిథులు, కళాశాల సిబ్బంది

కంచరపాలెం: విద్యార్థుల్లో మేధస్సు, కౌశలం, ప్రతిభాపాటవాలను ప్రోత్సహించేందుకు గణిత పోటీలు దోహద పడతాయని జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ పేర్కొన్నారు. కళాశాలలో గణిత విభాగాధ్యక్షులు డాక్టర్ కెప్టెన్ కె.సుజాత ఆధ్వర్యంలో అంతర కళాశాలల గణిత పోటీలను మంగళవారం నిర్వహించారు. నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పాల్గొని క్విజ్, సుడోకు, అర్థం మోజిష్, థింక్ ట్యాంక్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ గౌరీశంకర్, ప్రవీణ్, భారతి, శ్రీరామ్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.